

# శిక్ష

## సి. వి. నరసింహ దాసు

కాలేజీకి బయల్దేరే హడావుడిలో గబగబా రెడీ అవుతూనే ఆన్ చేసి మ్యూట్‌లో పెట్టిన టీవీ వైపు, అప్రయత్నంగా చూస్తూనే నా కళ్ళు ఒక్కసారిగా వెడల్పయ్యాయి.

వెంటనే సౌండ్ ఆన్ చేసి ఒక దాని వెనుక ఒకటిగా కనబడుతున్న దృశ్యాలని అర్థం చేసుకునేసరికి దాదాపు షాక్ లోకి వెళ్ళిపోయాను.

మనసంతా మొద్దుబారి పోయింది. కాళ్లు చేతులు కూడా కదపలేనంత నిస్సత్తువగా కుర్చీలో కూలబడి పోయాను.

నేను చూసినది ఓ 'భ్రాంతి' అని ఎవరైనా చెబితే

ఎంత బాగుణ్ను. అసలు నేనింకా నిద్రలోనే కల గంటున్నానని తెలిస్తే ఇంకెంత రిలీఫ్.. కానీ పీడకలలో కూడా రాకూడదని కోరుకునే దృశ్యం, ఒక యథార్థ వార్తగా లక్షల, కోట్ల వీక్షకుల ముందుకు వచ్చిందన్న విషయాన్ని నిర్ధారిస్తూ, నా గదిలోకి దూసుకు వచ్చారు స్నేహితురాళ్ళు.

వాళ్ళు కూడా టీవీ వార్తలు అప్పుడే చూశారుట. నాతో కన్‌ఫర్మేషన్ కోసం అడుగుతున్నారు.

నాక్కూడా విషయం టీవీ ద్వారానే తెలిసింది. బుర్ర బ్లాంక్ అయిపోయి వుంది.

ఏం సమాధానం చెప్పాలో తెలీని అభావంలో వుండిపోయాను. కాలేజీకి రాలేనన్న నన్ను ఒంటరిగా వదిలి వెళ్తూ వాళ్ళు చూసిన చూపులు మరచిపోలేకపోతున్నాను. వాటికి ఎన్ని అర్థాలు సందేహం, జాలి, ఈసడింపు, రోత, ఛీత్కారం.. వీటన్నిటినీ మించిన ఇంకేదో భావం ఆ చూపుల్లోంచి సూటిగా నా మనసును తాకి దారుణ హింసకు గురి చేస్తోంది.

మరి కొద్దిసేపట్లోనే నా చుట్టూ పత్రికల వాళ్ళు, టీవీ ఛానెళ్ళ వాళ్ళు మూగిపోయారు. వారిలో ఆడ, మగ, చిన్న, పెద్ద అందరూ వున్నారు.

తమ జర్నలిజం తెలివి తేటలన్నీ ఉపయోగించి, రకరకాల ప్రశ్నల్ని, వీలైనన్ని కోణాల్లో సంధిస్తూ, నా హావభావాల్ని లైవ్ కవరేజ్‌గా స్టూడియోలకి ప్రసారం చేస్తున్నారు. శవాల చేత కూడా సెన్సేషనల్‌గా మాట్లాడించగలిగే చాతుర్యం వాళ్ళకి బ్రతుకు తెరువు.

కాని నేనిప్పుడు శవాన్ని కూడా కాదు జీవచ్ఛవాన్ని. ఊహించని వైపు నుండి తగిలిన దెబ్బ నన్ను కోమాలోకి తోసేస్తే ఎంత బాగుణ్ను?

పిచ్చెక్కిపోయేలా వుంది అందరినీ బైటకి తరిమేసి, తలుపులన్నీ మూసేసి, ఆక్రోశం తగ్గేదాకా ఏడ్చాను. కుంభవృష్టి తర్వాత అలముకునే ప్రశాంతత మళ్ళీ నా వైపు తొంగి చూసింది.

అవును ఒక పెను తుఫాను బీభత్సాన్ని సృష్టించి వెళ్ళిపోయింది. తర్వాత కార్యక్రమమే ఇప్పుడు నేను చేయాల్సింది.

నాన్నని నేనెంతగా ప్రేమించాను. చిన్ననాటి నుండి అతడి అభిమానానురాగాల్ని తలచుకుని ఎంత గర్వపడేదాన్ని. కాలేజి ఏజ్‌కొచ్చినా నాన్నకి నేనింకా చిన్న పిల్లనే నా దృష్టిలో నాన్న ఓ హీమానే. అమ్మా నాన్న యిద్దరిలో నేను నాన్న వైపే ఎక్కువ మొగ్గు చూపుతాను. నాన్నకి నిర్వచనం అతడేనని వాదిస్తాను.

''హ్యాపీ బర్త్‌డే డాడీ. వేలకోట్ల ముద్దుల్ని బెలూన్లుగా ఊది నీ పుట్టిన రోజు కానుకగా ఆకాశంలోకి వదిలాను. నీకు కనిపిస్తున్న నక్షత్రాలన్నీ అవే. అందుకుని ఆస్వాదించు''.

''థాంక్సురా చిన్నా నా పుట్టిన రోజు గ్రీటింగ్స్ మొదట నీ నుండే అందుకోవాలని, వేరే ఫోన్లొచ్చినా అటెండ్ కాకుండా, నీ నంబర్ మాత్రమే రెస్పాండ్ అయ్యాను'' అట్నుంచి నాన్న గొంతులో ప్రేమామృతం. హైదరాబాద్ హాస్టల్లో వున్న నాకు రుచి తెలుస్తోంది.

సరిగ్గా నేను గ్రీటింగ్స్ చెప్పిన ఇరవై నాలుగు గంటల తర్వాత, అర్ధరాత్రి సమయాన, అతడు

సరిగ్గా నేను గ్రీటింగ్స్ చెప్పిన ఇరవై నాలుగు గంటల తర్వాత, అర్ధరాత్రి సమయాన, అతడు మరో పదిమంది మిత్రులతో పట్టుబడ్డాడు. ఓ స్టార్ హోటల్లో ఇతర రాష్ట్రాల నుండి తెప్పించిన సుందరీ మణులతో అశ్లీల కార్యకలాపాలతో..పట్టుబడ్డ వారంతా ఒక్కో రంగంలో పేరు మోసిన పెద్దమనుషులు, విద్యావేత్తలు.

మరో పదిమంది మిత్రులతో పట్టుబడ్డాడు. ఓ స్టార్ హోటల్లో ఇతర రాష్ట్రాల నుండి తెప్పించిన సుందరీ మణులతో అశ్లీల కార్యకలాపాలతో..

పట్టుబడ్డ వారంతా ఒక్కో రంగంలో పేరు మోసిన పెద్దమనుషులు, విద్యావేత్తలు, పోలీసు అధికారులు, రాజకీయనాయకులు, వ్యాపారవేత్తలు, సాహితీప్రముఖులు ఇంకా...

వ్యాపారరీత్యా నాన్నకి ప్రముఖులతో సంబంధాలున్నాయని తెలుసు గానీ, వాటిని తన పరమపదసోపాన పటంలో నిచ్చెనలుగా ఉపయోగించుకుని, బర్త్‌డే పార్టీ పేరుతో ఇంతనీచానికి ఒడిగట్టి, మనిషిగా దిగజారిపోతాడని ఊహించలేకపోయాను.

జుగుప్సాకరమైన దృశ్యాలు గుర్తుకు వస్తుంటే శరీరం దహించుకుపోతోంది.

పట్టుబడ్డవారంతా పత్రికల్లో ఏదో ఒక సందర్భంలో స్త్రీల పట్ల తమ గౌరవాన్ని నొక్కివక్కాణించిన వారే.

పైకి పవిత్రంగా కనిపిస్తూ, లోలోపల స్త్రీల అంగాంగాల్ని ఊహించుకుని ఆనందించే వీరు నీచత్వానికి పరాకాష్ఠ. పరాయి స్త్రీలో ఓ చెల్లినో, బిడ్డనో చూడలేని వీరికి ఏ శిక్ష సరిపోతుంది.

తప్పుడు పనులు చేసిన వారు శిక్షించబడాలి. ధనబలంతో వీళ్ళు నిర్దోషులుగా విడుదలై, పెద్దమనుషులుగా చెలామణి కావచ్చు.

అసలైన శిక్ష పడాల్సింది మరో వైపు నుండి...

ఒకనిర్ణయానికి వచ్చాక, అమ్మకి ఫోన్ చేశాను. నా నిర్ణయాన్ని తను క్షణాల్లో ఆమోదించి, నాకు ఆసరాగా తనూ వుంటానని అందంటే, ఓ భార్యగా, ఓ స్త్రీగా తనెంత వేదననుభవించి వుంటుందో ఊహించగలను.

అనుకున్నట్టే సాయంత్రం నాకు ఫోనొచ్చింది. ''ఒరే చిన్నా'' అంటూ ఏదేదో చెబుతున్నాడు.

''సారీ నాతల్లికి భర్త, నాకు తండ్రి అయిన రావివలస రామమోహన రావు అనే వ్యక్తి స్టేటస్ పిచ్చి, మదమోహం అనే జబ్బు లక్షణాలు ముదిరిపోయి, మనసంతా విషయమై, మనిషి నిలువెల్లా పతనమై నిన్న అర్ధరాత్రి మరణించాడు'' ఫోన్ పెట్టేశాను.

నా నిర్ణయం సరైనదో, కాదో కాలమే నిర్ణయిస్తుంది. పరిణామాలేమైనా, నామనోబలానికి మీ ఆశీస్సులే కొండంత అండ.

